సాక్షి ప్రకాశం

గురువారం । 7 । డిసెంబర్ । 2023



పొగాకు రైతులను ఆదుకునేందుకు కృషి

తుఫాన్ వల్ల పంట నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకునేందుకు టుబాకో బోర్డు కృషి చేస్తుందని బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ అన్నారు.

- 8లో..



విద్యుత్ సరఫరా పునరుద్ధరించాం

తుఫాన్ వల్ల దెబ్బతిన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను పునరుద్ధరించి విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా చేశామని ఎస్ఈ సత్యనారాయణ తెలిపారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
30.2/23.4

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. చల్లని గాలులు వీస్తాయి. అక్కడక్కడా చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

జాతీయ గీతాలాపనలో పాల్గొన్న మంత్రి సురేష్



జాతీయ గీతాలాపనలో పాల్గొన్న మంత్రి సురేష్

మార్కాపురం: మార్కాపురం పట్టణంలోని పాత బస్టాండులో ప్రతిరోజూ సరిగ్గా 8 గంటలకు నిర్వహిస్తున్న జాతీయ గీతమైన జనగణమన గీతాలాపనలో బుధవారం పురపాలక శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. తన కాన్వాయ్‌తో ఆయన పాత బస్టాండులో నుంచి వెళ్తుండగా జాతీయ గీతాన్ని ఆలపిస్తున్న విషయాన్ని తెలుసుకుని తాను కారులో నుంచి దిగి జాతీయగీతాలాపనలో పాల్గొని జాతీయ జెండాకు సెల్యూట్ చేశారు. రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా మార్కాపురంలో ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు జనగణమన గీతాన్ని ఆలపిస్తామని రెడ్డి సంక్షేమ సంఘం అధ్యక్షుడు గుంటక సుబ్బారెడ్డి తెలిపారు. ఈ గీతాలాపనకు వైఎస్సార్ సీపీ కౌన్సిలర్ డాక్టర్ చప్పల్లి కనకదుర్గ సహకరిస్తున్నారు. మంత్రి సురేష్ నిర్వాహకులను అభినందించారు.

ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించాలి

- కలెక్టర్ దినేష్‌కుమార్



వివిధ పార్టీల ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్ కుమార్

ఒంగోలు అర్బన్: ఓటర్ల జాబితా పారదర్శకంగా రూపొందించేందుకు చర్యలు తీసుకున్నామని అందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కోరారు. బుధవారం ప్రకాశం భవనంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులతో స్పెషల్ సమ్మరీ రివిజన్‌పై సమావేశం నిర్వహించారు. దీనిలో కలెక్టర్ మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని, అందుకు రాజకీయ పార్టీలు కృషి చేయాలన్నారు. ఫారం 8 ద్వారా షిఫ్టింగ్ ఓటర్లను సవరించాలన్నారు. ఓటరు జాబితాలో పొరపాట్లు కనిపిస్తే రాజకీయ పార్టీల ప్రతినిధులు తెలియచేయాలన్నారు. వచ్చే నెల 5వ తేదీ తుది ఓటరు జాబితా విడుదల చేస్తారన్నారు. ఓటరు జాబితా సవరణలో పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు త్వరగా పరిష్కరించాలన్నారు. దీనిలో జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతుమాధవన్, ఒంగోలు ఆర్డీవో విశ్వేశ్వరరావు, ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ శ్రీనివాసరావు, ఏఈఆర్ఓలు, తహశీల్దార్లు, వైఎస్సార్ సీపీ ప్రతినిధి దామరాజు క్రాంతికుమార్, ఇతర పార్టీల ప్రతినిధులు కాలేషబేగ్, యర్రయ్య, స్వరూప్, సత్యం, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

11, 12 తేదీల్లో జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు

ఒంగోలు: ఉమ్మడి జిల్లా స్థాయి కళా ఉత్సవ్ పోటీలు ఈనెల 11, 12 తేదీల్లో మైనంపాడులోని డైట్ కాలేజీలో నిర్వహిస్తున్నట్లు డీఈవో వీఎస్ సుబ్బారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. వోకల్ మ్యూజిక్ (క్లాసికల్, ట్రెడిషనల్ ఫోక్), ఇన్‌స్ట్రుమెంటల్ మ్యూజిక్ (పర్కసివ్, మెలోడిక్), డాన్స్ (క్లాసికల్, ఫోక్), విజువల్ ఆర్ట్స్ (2 డైమెన్షన్, 3 డైమెన్షన్), ఇండీజీనియస్ టాయిస్ అండ్ గేమ్స్, డ్రామా (సోలో యాక్టింగ్) కేటగిరీల్లో పోటీలు ఉంటాయన్నారు. ప్రతి క్యాటగిరీకి ఒక పాఠశాల/కాలేజీ నుంచి ఒక బాలిక, ఒక బాలుడు మాత్రమే పాల్గొనాలన్నారు. ఈ పోటీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ, ప్రైవేటు యాజమాన్య సంస్థలకు చెందిన అన్ని రకాల పాఠశాలలు, జూనియర్ కాలేజీల్లో 9, 10, 11, 12 తరగతులు చదువుతున్న విద్యార్థినీ విద్యార్థులు పాల్గొనేందుకు అర్హులన్నారు. పోటీలకు హాజరయ్యేటప్పుడు ఎస్కార్ట్ టీచర్‌తోపాటు తమ రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆధార్‌కార్డు, పేరెంట్స్, హెడ్మాస్టర్ డిక్లరేషన్ తీసుకురావాలన్నారు. జిల్లా స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన వారు ఈనెల 14, 15 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుందని, అందులో గెలుపొందిన వారు 2024 జనవరి 9, 10 తేదీల్లో న్యూఢిల్లీలో జరిగే పోటీలకు హాజరుకావాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు నోడల్ ఆఫీసర్ యం.రవీంద్రప్రసాద్, సెల్ నెంబర్ 9666146850ను సంప్రదించాలన్నారు.ఈ అవకాశాన్ని విద్యార్థినీ విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.



నాగులుప్పలపాడు మండలంలో తుఫాన్‌కు దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్



టంగుటూరు మండలంలో వర్షానికి దెబ్బతిన్న పొగాకు తోటను పరిశీలిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్



ఒంగోలు నగరంలోని సబ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న జిల్లా విద్యుత్ శాఖ ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ

ఆగమేఘాల పై..

మిచాంగ్ తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా నిలిచింది. మొదట్నుంచీ జిల్లా యంత్రాంగం అటు రైతులను...ఇటు ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వచ్చింది. మనుషులకు, పశువులకు ఎలాంటి ప్రాణాపాయం లేకుండా ఉండేలా అన్ని జాగ్రత్తలు తీసుకుంది. పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి తీర ప్రాంత ప్రజలను తరలించింది. వర్షాలు లేక అష్టకష్టాలు పడి సాగుచేసుకున్న పంటలను మిచాంగ్ అతలాకుతలం చేసింది. వ్యవసాయశాఖ అధికారులు ఆగమేఘాలపై పంట నష్టాన్ని అంచనా వేస్తూ రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరిస్తున్నారు. ఈదురు గాలులతో చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో ఏర్పడిన ఇబ్బందులను విద్యుత్ శాఖ అధికారులు తొలగించారు.

తుఫాన్ బాధితులకు అండగా ప్రభుత్వం

- పునరావాస కార్యక్రమాల్లో అధికారులు బిజీ
- వేగంగా తుఫాన్ నష్ట నివారణ చర్యలు
- జిల్లాలో 25,333 హెక్టార్లలో దెబ్బతిన్న పంటలు
- వాటిలో 22752 హెక్టార్లలో వ్యవసాయ, 2581 హెక్టార్లలో ఉద్యాన పంటలు
- సత్వరం పంట నష్టాన్ని అంచనా వేస్తున్న వ్యవసాయ, ఉద్యానశాఖ అధికారులు
- ప్రధానంగా పొగాకు, శనగ, మినుము, వరి, మిర్చిపై ప్రభావం
- చెరువుల్లో సగానికి పైగా వచ్చి చేరిన నీరు...కుంటల్లో సమృద్ధిగా చేరిన వైనం
- జిల్లాలో దెబ్బతిన్న పంటలను పరిశీలించిన మంత్రి సురేష్, కలెక్టర్ దినేష్ కుమార్

విద్యుత్ శాఖ నష్టం రూ.86.70 లక్షలు

- విద్యుత్ లైన్‌లలో పునరుద్ధరణ పనులూ సకాలంలో..
- కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ల స్థానంలో కొత్తవి ఏర్పాటు
- ఉమ్మడి ప్రకాశం జిల్లాలో 685 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

సాక్షిప్రతినిధి, ఒంగోలు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మూడు రోజులుగా కురిసిన వర్షాలు, చలి గాలులతో కూడిన ఈదురు గాలులు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. తీవ్ర వర్షాభావంతో ఎదురు చూస్తున్న ఉమ్మడి ప్రకాశం జిల్లా రైతాంగాన్ని ఊపిరి పోస్తుందనుకుంటే వేల హెక్టార్లలో పంటలను నీటి ముంచి వెళ్లింది. ఈదురు గాలుల ప్రభావంతో ఉమ్మడి జిల్లాలో విద్యుత్ వ్యవస్థను ఛిన్నాభిన్నం చేసింది. 685 గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. వేలాది ఎకరాల్లో వ్యవసాయ, ఉద్యాన పంటలను నీటమునిగాయి. సోమవారం తుఫాన్ తీరం దాటడంతో అధికారులు వెంటనే నష్ట నివారణ చర్యలు చేపట్టారు. ప్రధానంగా గ్రామ సచివాలయాల సిబ్బంది, వలంటీర్ల ద్వారా రైతులకు ముఖ్యమైన సూచనలు చేశారు. పంట పొలాల్లో నిలిచిన నీటిని వెను వెంటనే బయటకు పంపించే ఏర్పాట్లు చేసుకోవాలని సలహా ఇచ్చారు. దీంతో పంట పొలాల్లో ఉండే నీటిని వాలు ప్రాంతాల్లోకి పంపించే ఏర్పాట్లలో రైతు కుటుంబాలు నిమగ్నమయ్యాయి. ఇదిలా ఉంటే జిల్లాలో దెబ్బతిన్న పంటలను రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ పరిశీలించారు. కలెక్టర్ ఏఎస్.దినేష్‌కుమార్ నాగులుప్పలపాడు మండలంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పర్యటించి పంటల నష్టాన్ని పరిశీలించారు. ముఖ్యమంత్రి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ప్రత్యేక అధికారి ప్రద్యుమ్న, కలెక్టర్ పాల్గొని జిల్లాలో నెలకొని ఉన్న పరిస్థితులను వివరించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోని బాధితులు ఇళ్లకు వెళ్లే వారి ఒక్కో కుటుంబానికి రూ.2500 ఇచ్చి మరీ పంపి ఆదుకుంటున్నారు. టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్ కుమార్ నాగులుప్పలపాడు, టంగుటూరు, మద్దిపాడు, జరుగుమల్లి, ఒంగోలు ప్రాంతాల్లో పర్యటించి బాధిత రైతులకు అండగా ఉంటామని ధైర్యం చెప్పారు.



దర్శి ఆటోనగర్‌లో విద్యుత్ తీగలపై పడిన చెట్లను తొలగిస్తున్న సిబ్బంది

25,333 హెక్టార్లలో పంటల నష్టం

జిల్లాలో వ్యవసాయ, ఉద్యానవన శాఖల్లో కలిపి మొత్తం 25,333 హెక్టార్లలో పంటల నష్టం వాటిల్లినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాలు రూపొందించారు. నీట మునిగిన పంటలను, వర్షానికి, ఈదురు గాలులకు పడిపోయిన పంటలను అన్నింటినీ పరిగణలోకి తీసుకున్నారు. ఖరీఫ్, రబీ సీజన్లలో వేసిన అన్నిరకాల పంటలను పరిగణలోకి తీసుకొని నివేదికలు సిద్ధం చేశారు. ప్రధానంగా వాణిజ్య పంట అయిన పొగాకుపై ఈ తుఫాన్ ప్రభావం చూపించింది. పొగాకు పంట 9640 హెక్టార్లలో దెబ్బతింది. ఆ తరువాత స్థానంలో శనగ పంట 4699 హెక్టార్లలో, మినుము 2398 హెక్టార్లలో, ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన వరి 3664 హెక్టార్లలో, ఖరీఫ్, రబీ సీజన్లలో సాగు చేసిన మొక్కజొన్న 893 హెక్టార్లలో, ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన కంది 733 హెక్టార్లలో దెబ్బతిన్నాయి. ఇక మిగతా పంటలు నువ్వులు, వేరుశనగ, అలసంద, ఉలవ, పెసర, జొన్న పంటలు ఉన్నాయి. ఆదేవిధంగా ఉద్యానవన శాఖలో మొత్తం 2581 హెక్టార్లలో పండ్ల తోటలు, కూరగాయల తోటలు, మిర్చి తోటలు దెబ్బతిన్నాయి. వాటిలో ప్రధానంగా మిర్చి పంట 2457 హెక్టార్లలో దెబ్బతింది. ఆ తరువాత స్థానంలో అరటి 96 హెక్టార్లలో దెబ్బతినగా మిగతా బొప్పాయి, జామతో పాటు ఇతర కూరగాయల తోటలు దెబ్బతిన్నాయి.

విద్యుత్ లైన్లు అస్తవ్యస్తం..

తుఫాన్ తాకిడికి ఒంగోలు నగరం, ఒంగోలు మండలం, కొత్తపట్నం మండలాలతో పాటు నెల్లూరు జిల్లాలోని కందుకూరు నియోజకవర్గం, బాపట్ల జిల్లా అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలో విద్యుత్ వ్యవస్థకు తీవ్ర నష్టం వాటిల్లింది. మొత్తం 685 గ్రామాల్లో విద్యుత్‌కు అంతరాయం ఏర్పడింది. రూ.86.70 లక్షల మేర నష్టం వాటిల్లింది. రేయింబవళ్లు 3 వేల మందికి పైగా విద్యుత్ అధికారులు, సిబ్బంది నిరంతరాయంగా పనిచేసి మరమ్మతులు చేశారు. విద్యుత్ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా చేశారు.

కుంటలు, చెరువుల్లోకి పుష్కలంగా చేరిన నీరు...

ఇప్పటి వరకు తీవ్ర వర్షాభావంతో సాగు నీటి చెరువుల్లోకి నీరు వచ్చి చేరింది. మొన్నటి వరకు చుక్కనీరు లేని చెరువుల్లోకి సైతం నీరు రావటంతో గ్రామీణ ప్రాంతాల్లో తాత్కాలికంగా నీటి కొరత తీరినట్లయింది. సాగు నీటి చెరువులతో పాటు కుంటలు నిండు కుండల్లా మారాయి. వాగులు, వంకలు పొంగి పొర్లాయి. ఇప్పటికిప్పుడు భూగర్భ జలాలు పెరగకపోయినా నేలతల్లి మాత్రం చల్లబడిందనటంలో సందేహం లేదు. ఒక్క పశ్చిమ ప్రకాశంలోని కొన్ని ప్రాంతాలు మినహా జిల్లాలోని మిగతా ప్రాంతాల్లో వర్షాలు మెండుగానే కురిశాయి.

తెగిన ఎమిలేయర్ చానల్ కాలువ

నాగులుప్పలపాడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో వరద నీరు ఉధృతి కావడంతో ఎగువన ఉన్న రాఘూరు కాలువ ఎమిలేయర్ చానల్ నుంచి వరద ఉధృతి పెరిగి ఈదుమూడి గ్రామం వద్ద చానల్‌కు గండి పడింది. దీంతో మిరప పంట పూర్తిగా నీట మునిగినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ధాటికి కాలువ తెగి పంట మునక వలన ఎస్సీ రైతులకు చెందిన సుమారు 70 ఎకరాల వరకు మిరప పంట దెబ్బతిందని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎమిలేయర్ చానల్ కాలువ తెగిపోవడంతో మిరప పంటపై పడ్డ వదర నీరు

తుఫాన్ బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుంది

- ప్రాథమిక అంచనా మేరకు సుమారు 15 వేల హెక్టార్ల పంట నష్టం
- కలెక్టర్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: మిచాంగ్ తుఫాన్ బాధితులకు, పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం అండగా ఉంటుందని అందరినీ ఆదుకుంటామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. తుఫాన్ ప్రభావిత జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బుధవారం వీడియో సమావేశం నిర్వహించి తుఫాన్ బాధితులకు అండగా ఉండి అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రకాశం భవనం నుంచి కలెక్టర్‌తో పాటు జిల్లా స్పెషల్ ఆఫీసర్ పీఎస్ ప్రద్యుమ్న, ఎస్పీ మలికాగర్గ్, జాయింట్ కలెక్టర్ కే శ్రీనివాసులు, ఏఎస్పీ నాగేశ్వరరావు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా పరిస్థితిని కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు. తుఫాను వల్ల ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా చర్యలు తీసుకున్నామని, ప్రభావిత ప్రాంత ప్రజలను పునరావాస శిబిరాలకు తరలించామని తెలిపారు.

అనంతరం వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశంనిర్వహించారు. తుఫాన్ వల్ల ప్రాథమిక అంచనా మేరకు సుమారు 15 వేల హెక్టార్లలో పంటలు దెబ్బతిన్నట్లు తెలిపారు. పంటల స్థాయి, దెబ్బతిన్న తీరుపై సర్వే చేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నష్టపోయిన రైతులకు పంటల స్థాయిని బట్టి సబ్సిడీ విత్తనాలు, ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ వచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో 236 గ్రామాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడగా వెంటనే సరిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. నీరు నిలిచిన చోట పారిశుద్ధ్య పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. ఎటువంటి అంటువ్యాధులు ప్రబలకుండా వైద్య ఆరోగ్య శాఖ తగిన చర్యలు తీసుకోవాలన్నారు. పునరావాస కేంద్రాల్లో ఉంటున్న వారికి ప్రజాప్రతినిధుల చేతుల మీదుగా ఒక్కో కుటుంబానికి రూ.2500 చొప్పున ఆర్థిక సహాయం చేస్తున్నట్లు తెలిపారు.



సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా స్పెషల్ అధికారి ప్రద్యుమ్న, కలెక్టర్ దినేష్ కుమార్, జిల్లా ఎస్పీ మలికా గర్గ్, జేసీ కె.శ్రీనివాసులు, అధికారులు

తుఫాన్ బాధిత రైతులను ఆదుకోవాలి

నాగులుప్పలపాడు: మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో మండలంలో పంటలు కోల్పోయిన రైతులను త్వరితగతిన ఆదుకోవడానికి అధికారులు చర్యలు చేపట్టాలని కలెక్టర్ దినేష్ కుమార్ ఆదేశించారు. తుఫాన్ ప్రభావం వలన మండల వ్యాప్తంగా సాగు చేసిన పంటలు చాలా మేరకు దెబ్బతిన్నాయని వ్యవసాయ శాఖ అధికారులు ప్రాథమిక అంచనా వేసి ఉన్నతాధికారులకు నివేదికలు పంపడంతో బుధవారం కలెక్టర్ దినేష్ కుమార్ మండలంలోని చదలవాడ, నాగులుప్పలపాడు గ్రామాల్లో పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 700 హెక్టార్లలో వరి, 164 హెక్టార్లలో మినుము, 14 హెక్టార్లలో కంది, 950 హెక్టార్లలో పొగాకు, వెయ్యి హెక్టార్లలో మిరప పంట వర్షానికి దెబ్బతిందని అధికారులు అంచనా వేయగా సంబంధిత పంటలను కలెక్టర్ దినేష్ కుమార్ పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఏ ఒక్క రైతూ అధైర్యపడవద్దని భరోసా ఇచ్చారు. అవసరమైన చోట రైతులకు వ్యవసాయాధికారులు అందుబాటులో ఉండి తగు పరిష్కార మార్గాలు తెలియజేయాలని ఆదేశించారు. వరద తగ్గిన తరువాత పూర్తి స్థాయి పంట నష్టాన్ని రేపటి లోగా అందించాలని తెలిపారు. అనంతరం నాగులుప్పలపాడులో నిర్మాణంలో ఉన్న సచివాలయ భవనాన్ని పరిశీలించి సచివాలయ భవనం త్వరితగతిన పూర్తి కావడానికి అవసరమైన నిధులను వెంటనే అందజేస్తానని హామీ ఇచ్చారు. కలెక్టర్ వెంట జేడీఏ శ్రీనివాసరావు, ఏఎంసీ చైర్మన్ మారెళ్ల బంగారుబాబు, తహసీల్దార్ సుజన్ కుమార్, రైతు సంఘం నాయకులు జయంత్ బాబు, ఏడీఏ రమేష్ బాబు, ఉద్యానవనశాఖ, వ్యవసాయశాఖ ఏవో లు ప్రత్యూష, వెంకట్రావు, సీఆర్ ఏఈ ప్రసాద్, సిబ్బంది ఉన్నారు.



నాగులుప్పలపాడులో తుఫాన్‌కు దెబ్బతిన్న మిరప పంటను పరిశీలిస్తున్న కలెక్టర్ దినేష్ కుమార్

అంబేడ్కర్ జీవితం ఆదర్శనీయం

- కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

ఒంగోలు సెంట్రల్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని భావితరాలు ముందుకు సాగాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ పేర్కొన్నారు. సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. హెచ్‌సీఎం జూనియర్ కళాశాల, కోలాస్ హోటల్ ఎదురుగా ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ భారతరత్న, ప్రపంచ మేధావి, భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ ఆశయాలను కొనసాగించటమే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. అంబేడ్కర్ స్ఫూర్తితో యువత విద్య అనే ఆయుధంతో ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల వారికి ఓటు హక్కు లేకుండా చేసిన రోజుల నుంచి రాజ్యాధికారం చేతి కందించే రోజుల వరకు మార్పు వచ్చిందంటే అంబేడ్కర్ చేసిన కృషి ఫలితమేనని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన ఆశయాలను కొనసాగిండానికి నడుం బిగించినట్లు వివరించారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ సాధికారత అధికారి లక్ష్మానాయక్, బీసీ సంక్షేమ అధికారి అంజలి, బీసీ కార్పొరేషన్ ఈడీ ధనలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అర్జున్ నాయక్, డీఆర్‌డీఏ పీడీ రవికుమార్, డీటీసీ ఆర్ సుశీల, మాజీ ఎమ్మెల్యే ఆదెన్న, దళిత సంఘాల నాయకులు నీలం నాగేంద్రం, చప్పిడి వెంకటరావు, బిళ్లా చెన్నయ్య, టీ అనంద్ మాదిగ, పత్రా బంగారం, దాసరి శివాజీ పాల్గొన్నారు.

మహనీయుడు అంబేడ్కర్




అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న మంత్రి సురేష్

మార్కాపురం: దేశ మొదటి న్యాయశాఖామంత్రి రాజ్యాంగ రచనా చైర్మన్, దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటిచెప్పిన దార్శనికుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని మున్సిపల్ శాఖామంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా డాక్టర్ సామ్యూల్ జార్జి కళాశాలలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆ మహనీయుడి అడుగుజాడల్లో నడుస్తూ ఆయన ఆశయాలకు పునరంకితం కావాలని పిలుపునిచ్చాడు. కళాశాల డైరెక్టర్ ఆదిమూలపు విశాల్, గ్రంథాలయ చైర్మన్ పిచ్చయ్య, త్రిపురాంతకం ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రెంటపల్లి సుబ్బారెడ్డి, కేసీహెచ్ ఓబుల్‌రెడ్డి, పోరెడ్డి చెంచిరెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజబాబు, డీస్ మస్తానయ్య, ఎస్ఎస్ఎస్ పీఓ సురేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అన్నివర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్

- వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్‌కు ఘన నివాళి
- నగర మేయర్ గంగాడ సుజాత

ఒంగోలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ అంబేడ్కర్ దేశంలోని అన్ని వర్గాలకు ఆశాజ్యోతి అన్నారు. మహిళా విద్యకు పెద్దపీట వేసి దేశం నేడు అగ్రపథంలో ఉండేందుకు ఆయన అందించిన స్ఫూర్తి మరువలేనిదన్నారు. ఆయన ఒక చేతిలో పుస్తకం, మరో చేతిలో పెన్నుతో విద్య విలువ ఏమిటో ఆయన ప్రపంచానికి చాటిచెప్పాడన్నారు. ఆర్థిక అసమానతలు రూపుమాపాలన్నా, సామాజిక న్యాయం జరగాలన్నా అందుకు విద్య ఒక్కటే మార్గమని చాటిచెప్పిన మహనీయుడు అంబేడ్కర్ అన్నారు. ఒకటో క్లస్టర్ ఇన్‌చార్జి రాయపాటి అంకయ్య మాట్లాడుతూ నేడు పేదలకు ఉచిత విద్య, అందులోను ఆంగ్ల మాధ్యమాన్ని అందుబాటులోకి తీసుకురావడంతోపాటు చదువుకునేంత వరకు తాను ఉన్నానంటూ కుటుంబానికి భారం కాకుండా ప్రతి ఒక్కరూ చదువుకునేలా బాధ్యత తీసుకున్న ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ప్రజల ముంగిటకు తీసుకెళ్తున్న సీఎం జగన్ విజయవాడలో 125 అడుగుల కాంస్య విగ్రహాన్ని ఏర్పాటు చేయడం ప్రతి ఒక్కరూ స్వాగతించాల్సిన విషయం అన్నారు. చీమకుర్తి జెడ్పీటీసీ సభ్యుడు వేమా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలో అంబేడ్కర్ ఆశయాలను ఆచరణ రూపంలోకి తీసుకొచ్చిన జగన్‌మోహన్‌రెడ్డిని 2024లో కూడా ముఖ్యమంత్రిగా చేసుకోవడం ద్వారా సామాజిక న్యాయాన్ని సంపూర్ణం చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నగర కన్వీనర్ కటారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు పసుమర్తి గోపి, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు తమ్మినేని మాధవి, ప్రచార విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దామరాజు క్రాంతికుమార్, సాంస్కృతిక విభాగం రీజినల్ కోఆర్డినేటర్ బొట్ల సుబ్బారావు, ఎస్సీ సెల్ రీజినల్ కోఆర్డినేటర్ మాకం జాన్‌పాల్, రాష్ట్ర కార్యదర్శి గుర్రం వెంకయ్య, ట్రేడ్ యూనియన్ నగర అధ్యక్షుడు గోవర్ధన్‌రెడ్డి, సూపర్‌బజార్ డైరెక్టర్ వల్లెపు మురళి, కావూరి సుశీల, మైనార్టీ సెల్ నగర అధ్యక్షుడు షేక్ మీరావలి, కార్పొరేటర్లు, వివిధ డివిజన్ల అధ్యక్షులు, పార్టీ అభిమానులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొని అంబేడ్కర్ చిత్రపటంతోపాటు వైఎస్సార్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మేయర్ గంగాడ సుజాత, పార్టీ నాయకులు



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, మేయర్ గంగాడ సుజాత, వివిధ కార్పొరేషన్ల బాధ్యులు

ఇంటర్ పరీక్ష ఫీజు గడువు ఈనెల 11 వరకు పొడిగింపు

ఒంగోలు: ఇంటర్మీడియెట్ పరీక్ష ఫీజు అపరాధ రుసుం లేకుండా ఈనెల 11వ తేదీ వరకు పొడిగించారని ఆర్ఐవో ఎ.సైమన్ విక్టర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం రెగ్యులర్‌గా మొదటి సంవత్సరం, ద్వితీయ సంవత్సరం చదువుతున్న జనరల్, ఒకేషనల్ విద్యార్థులు, ఫెయిల్ అయి ప్రైవేటుగా విద్యను అభ్యసిస్తున్న వారు పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించాలన్నారు. రూ.1000 అపరాధ రుసుముతో ఈనెల 29వ తేదీ వరకు పరీక్ష ఫీజు చెల్లించేందుకు అవకాశం ఉందని చెప్పారు. గతంలో ఏ విద్యా సంవత్సరంలో అయినా ఫెయిలైన వారు అయినా పరీక్షలు రాసేందుకు అర్హులే అన్నారు. ఫెయిలైన విద్యార్థులు పరీక్ష రాసేందుకు వారి ఫెయిలైన మార్కుల మెమోతో పరీక్ష ఫీజు చదివిన కాలేజీలో పరీక్ష ఫీజు చెల్లించాలన్నారు. మొదటి లేదా రెండో సంవత్సరం చదువుతున్న రెగ్యులర్ విద్యార్థులు పరీక్ష ఫీజు రూ.550, సైన్స్ విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్ష ఫీజు కింద రూ.250 చెల్లించాలన్నారు.

క్లుప్తంగా

డాక్ సేవక్‌ల సమస్యలు పరిష్కరించాలి

● పార్లమెంట్‌లో ఒంగోలు ఎంపీ మాగుంట

ఒంగోలు: తపాలాశాఖ గ్రామీణ డాక్‌సేవక్‌ల డిమాండ్లపై ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి ప్రశ్న లేవనెత్తారు. తపాలాశాఖలో ఎన్నో ఏళ్ల నుంచి గ్రామీణ డాక్ సేవక్ ఉద్యోగులు పనిచేస్తున్నారని, వారు దేశంలోని 60 శాతం గ్రామీణ ప్రజల సేవింగ్స్ బ్యాంకు, సేవింగ్స్ సర్టిఫికెట్లు, తదితర అవసరాలకు సంబంధించిన విషయాలు చూస్తున్నారని తెలిపారు. వారు సివిల్ పోస్టులకు అర్హత కలిగి ఉండటంతో సాధారణ పౌర పోస్టులకు వారు అర్హులని సుప్రీంకోర్టు కూడా ప్రకటించడం జరిగిందన్నారు. అందువలన గ్రామీణ డాక్ సేవక్‌లు కోరుతున్న విధంగా వారికి 8 గంటల పని విధానాన్ని ఆమోదించడం, చంద్రకమిటీ మంజూరు చేసిన మూడు సమయ స్థాయి పెంపుదలను మంజూరు చేయడం, వారికి రూ.5 లక్షల గ్రాట్యుటీ ఆమోదించడం, వైద్య సదుపాయాలు కల్పించడం, జీతభత్యాలు పెంపుదల చేయడం వంటివి చేపట్టాలని ఎంపీ మాగుంట కోరారు.

తీరు మారని రౌడీషీటర్ జిల్లా బహిష్కరణ

● ఎస్పీ మలికాగర్గ్ వెల్లడి

ఒంగోలు సబర్బన్: తీరు మారని రౌడీషీటర్‌ను జిల్లా పోలీసులు జిల్లా నుంచి బహిష్కరించారు. ఆ మేరకు ఎస్పీ మలికాగర్గ్ బుధవారం ప్రకటన విడుదల చేశారు. చెడు నడత కలిగిన వారిపై నిరంతరం నిఘా ఉంటుందని ఎస్పీ పేర్కొన్నారు. ఎవరైనా శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే సహించేది లేదని హెచ్చరించారు. జిల్లాలో నేర ప్రవృత్తి, చెడు నడత కలిగిన వారిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వారిపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఎన్నిసార్లు హెచ్చరించినా కూడా నేరాలకు పాల్పడుతున్న వారిపై జిల్లా బహిష్కరణ వేటు వేసేందుకు కూడా వెనకాడేది లేదన్నారు. అందులో భాగంగా ఒంగోలు గోపాల్‌నగర్‌కు చెందిన రౌడీషీటర్ వెలుగోటి వెంకట సాయి కళ్యాణ్ (22)ను జిల్లా నుంచి 6 నెలలపాటు బహిష్కరించినట్లు వివరించారు. సాయికళ్యాణ్ అనే రౌడీషీటర్ వివిధ నేరాల్లో అరెస్టయి జైలుకు వెళ్లి బయటకు వచ్చినా కూడా తన నేర ప్రవృత్తి మార్చుకోకుండా ప్రవర్తిస్తున్నట్లు గుర్తించి ఈ కఠిన నిర్ణయం తీసుకున్నామన్నారు. శాంతి భద్రతలకు, సామాన్య ప్రజానీక జీవనానికి విఘాతం కలిగిస్తున్నాడని పోలీస్ అధికారులు ప్రతిపాదనలు పంపించినట్లు ఎస్పీ వెల్లడించారు. దీంతో అతనిపై యాంటీ సోషల్ అండ్ హజార్డియస్ యాక్టివిటీస్ యాక్ట్-1980 ప్రకారం బుధవారం కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపామన్నారు. దీంతో జిల్లా బహిష్కరణ చేస్తూ కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ప్రజల ప్రశాంతతకు భంగం కలిగిస్తే ఎంతటి వారైనా చర్యలకు గురికాక తప్పదని హెచ్చరించారు.


సిడ్నీలో ఘనంగా ఇండియన్ నేవీ డే



సిడ్నీలో ఇండియన్ నేవీ డే కార్యక్రమంలో పాల్గొన్న జిల్లావాసులు

ఒంగోలు: ఆస్ట్రేలియాలోని సిడ్నీ మహానగరంలో ఇండియన్ నేవీ డే కార్యక్రమాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఇరిగేషన్ డిపార్టుమెంట్ రిటైర్డ్ ఎస్ఈ టి.విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఎస్పీ సాయిబాబు, యునైటెడ్ డిఫెన్స్ వెటరన్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు నెప్పలి నాగేశ్వరరావు పాల్గొని మాట్లాడారు. భారతదేశ సరిహద్దుల గురించి మాట్లాడుతూ ఆక్రమిత కాశ్మీర్, సియాచిన్, ఆక్సాయిచిన్, కారకోర రహదారి, గల్వాన్ లోయ, టిబెట్టు, నేపాల్, బంగ్లాదేశ్‌తో కలిపి 4056 కిలోమీటర్ల మార్గాన్ని నిత్యం సైన్యం పహారా కాస్తుందన్నారు. బంగ్లా నుంచి కరాచీ వరకు కోస్టల్ నేవీ ఫోర్సు ఆధ్వర్యంలో గార్డింగ్ జరుగుతోందన్నారు. 1971 నుంచి డిసెంబర్ 4వ తేదీ నేవీ డే జరుపుకుంటున్నామని, కరాచీపై మన యుద్ధ నౌకలు ఘన విజయం సాధించిన రోజుగా ఈ నావికాదళ దినోత్సవం జరుపుకుంటున్నామని వివరించారు. ఐఎన్ఎస్ విక్రాంత్(ఎయిర్‌క్రాఫ్ట్ ఫైటర్ జెట్స్ 32) ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందన్నారు. భద్రతాపరంగా సైన్యం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో పీవీ విజయ్‌కుమార్, కె.వసంత్‌కుమార్, కె.అంజిరెడ్డి, బి.మల్లికార్జునరెడ్డి, జె.నరసింహులు, ఎస్వీ సుబ్బారావు, డాక్టర్ ఫ్రాన్సిస్, డీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వరద ఉధృతికి 30 గొర్రెలు గల్లంతు



గొర్రెల కోసం గాలిస్తున్న వెంకటేశ్వర్లు

దర్శి: వరద ఉధృతికి 30 గొర్రెలు గల్లంతయ్యాయి. ఈ సంఘటన మండలంలోని మారెడ్డిపల్లెలో జరిగింది. వివరాల్లోకి వెళితే.మారెడ్డిపల్లెకు చెందిన వెంకటేశ్వర్లు మంగళవారం గొర్రెలు పొలానికి తోలుకొని వెళ్లి తిరిగి వచ్చారు. ఆ గ్రామానికి రెండు దార్లు ఉండటంతో గొర్రెలు వర్షానికి రెండు దార్లకు విడివిడిగా వెళ్లాయి. ఈ సమయంలో భారీ వర్షానికి వాగు పొంగడంతో 30 గొర్రెలు గల్లంతు కాగా అందులో 11 గొర్రెలు మృతి చెంది కనిపించాయి. మిగిలిన గొర్రెలు ఉన్నాయా లేక మృతి చెందాయో కూడా తెలియక వాటి కోసం గొర్రెల కాపరులు గాలిస్తున్నారు.

పొగాకు రైతులను ఆదుకునేందుకు కృషి

● నీట మునిగిన పంటను పరిశీలించిన బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్



పొగాకు రైతుల నుంచి వినతిపత్రం స్వీకరిస్తున్న పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్

ఒంగోలు సెంట్రల్: మిచాంగ్ తుపాన్‌కు నష్టపోయిన పొగాకు రైతులను ఆదుకునేందుకు కేంద్ర ప్రభుత్వం ద్వారా తన వంతు కృషి చేస్తానని జాతీయ టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ అన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో బుధవారం ఆయన పర్యటించి భారీ వర్షాలకు నీట మునిగిన పొగాకు పంటను పరిశీలించారు. ఒంగోలు అసెంబ్లీ పరిధిలోని చీర్వానుప్పలపాడు, త్రోవగుంట, ముక్తినూతలపాడు గ్రామాల్లో పొగతోటలను పరిశీలించారు. వ్యవసాయాధికారులు త్వరగా పంట నష్టం వివరాలు పంపితే తనవంతుగా నష్టపరిహారం అందేలా చూస్తానని రైతులకు హామీ ఇచ్చారు. ఆయన వెంట బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి, బోర్డు మెంబర్ బ్రహ్మయ్య, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, స్థానిక నాయకులు, రైతులు ఉన్నారు.

మద్దిపాడు మండలంలో..

మద్దిపాడు: మిచాంగ్ తుపాన్‌కు మద్దిపాడు మండలంలోని పలు గ్రామాల్లో నీట మునిగిన పొగాకు పంటను పొగాకు బోర్డు చైర్మన్ సీహెచ్ యశ్వంత్‌కుమార్ బుధవారం పరిశీలించారు. మల్లవరం గ్రామంలో పొగాకు రైతులతో కలిసి పొలాలను పరిశీలించారు. అనంతరం రైతులతో భేటీ అయ్యారు. పంటకు ఏమైనా నష్టం జరిగిందా, పంటను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి రైతులతో చర్చించారు. పొగాకు రైతులకు బోర్డు అండగా ఉంటుందని తెలిపారు. వెల్లంపల్లి పొగాకు బోర్డు పరిధిలోని పలు గ్రామాల్లోనూ పంటను పరిశీలించినట్లు వేలం నిర్వహణాధికారి సత్య శ్రీనివాస్ తెలిపారు. కార్యక్రమంలో పొగాకు బోర్డు మెంబర్ పొద వరప్రసాద్, ఎక్స్‌టెన్షన్ మేనేజర్ దామోదర్, ఫీల్డ్ ఆఫీసర్ చలమయ్య, పలువురు రైతులు పాల్గొన్నారు.

పొగతోటల్లో నీరు నిలవకుండా చూడాలి...

కొండపి (జరుగుమల్లి): మిచాంగ్ తుఫాన్ ప్రభావంతో కురిసిన భారీ వర్షాలకు పొగతోటల్లో నీరు నిలవకుండా చూడాలని పొగాకు బోర్డు చైర్మన్ చిడిపోతు యశ్వంత్‌కుమార్ రైతులకు సూచించారు. కొండపి మండలంలోని ముప్పవరం, మిట్టపాలెం, గోగినేనివారిపాలెం గ్రామాల్లో పొగాకు పంటను బుధవారం ఆయన పరిశీలించారు. లేత తోటల్లో చనిపోయిన మొక్కల స్థానంలో మళ్లీ కొత్త మొక్కలు వేసేటప్పుడు కాపర్ ఆక్సిక్లోరైడ్ (బ్లైటాక్స్) 20 గ్రాములను 10 లీటర్ల నీటిలో కలిపి మొక్కల పాదుల్లో పోసి నాటుకోవాలని రైతులకు సూచించారు. భూమి నేల ఆరిన తర్వాత అంతర సేద్యం చేస్తే మొక్క వేరు వ్యవస్థకు గాలి ప్రసరణ బాగా జరిగి కావాల్సిన పోషకాలు అంది పెరుగుదలకు తోడ్పడుతుందన్నారు. లద్దె పురుగు ఎక్కువగా ఉంటే ఇమామెక్టిన్ బెంజియోట్ 5 గ్రాములను 10 లీటర్ల నీటిలో కలిపి వాడాలన్నారు. అనంతరం కొండపి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో కొండపి పొగాకు బోర్డు వేలం నిర్వహణ అధికారి జి.సునీల్‌కుమార్, విస్తరణ అధికారి జి.దామోదర్, సీనియర్ గ్రేడింగ్ అధికారి టి.సాయికుమార్, బోర్డు సభ్యులు బొడ్డపాటి బ్రహ్మయ్య, క్షేత్రస్థాయి సిబ్బంది, పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

టంగుటూరు మండలంలో...

టంగుటూరు: స్థానిక వేలం కేంద్రం పరిధిలోని టంగుటూరు, శివపురం, తూర్పునాయుడుపాలెం, కారుమంచి, మల్లవరప్పాడు, ఎం.నిడమానూరు, జమ్ములపాలెం తదితర గ్రామాల్లో దెబ్బతిన్న పొగతోటలను బుధవారం పొగాకు బోర్డు చైర్మన్ యశ్వంత్‌కుమార్ పరిశీలించారు. తోటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. విస్తరణ విభాగం మేనేజర్ దామోదర్, వేలం నిర్వహణాధికారి శ్రీనివాసరావు, క్షేత్రస్థాయి సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్, వేదికపై మేయర్ గంగాడ సుజాత, తదితరులు

ప్రపంచ మేధావి.. అంబేడ్కర్

● కలెక్టర్ దినేష్‌కుమార్

● జయహో అంబేడ్కర్ గీతం ఆవిష్కరణ

ఒంగోలు టౌన్: దేశం తలరాతను మార్చేందుకు చదువును ఆయుధంగా ప్రజల చేతుల్లో పెట్టిన మహోన్నతుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ కొనియాడారు. భారత రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా చైతన్య స్వరభారతి అధ్యక్షుడు నూకతోటి శరత్ రూపొందించిన జయహో అంబేడ్కర్ వీడియో గీతాన్ని బుధవారం స్థానిక ఎన్టీఆర్ కళాక్షేత్రంలో కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశంలోని అసమానతలను రూపుమాపేందుకు కత్తి పట్టకుండా, కర్ర పట్టకుండా పెన్ను, పుస్తకం పట్టిన గొప్ప మానవతా వాది అంబేడ్కర్ అని కొనియాడారు. యావత్ ప్రపంచానికి అంబేడ్కర్ స్ఫూర్తినిచ్చారని తెలిపారు. అందుకే నేడు ప్రపంచం మొత్తం ఆయనను గౌరవిస్తోందని చెప్పారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను కళ్లకు కట్టినట్టు రూపొందించిన ప్రజా గాయకుడు శరత్‌బాబును కలెక్టర్ అభినందించారు. అంబేడ్కర్ లేకుంటే వెనుకబడిన కులాలను పట్టించుకునే నాథుడు ఎవరూ ఉండేవారు కాదేమోనని నగర మేయర్ గంగాడ సుజాత అన్నారు. బాబాసాహెబ్ త్యాగాల వలనే నేడు దళితులు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధిస్తున్నారని చెప్పారు. అనంతరం వీడియో సమర్పకుడు మండవ మురళీకృష్ణ, ఎడిటర్ షాన్‌లను సత్కరించారు. కార్యక్రమంలో గాయకుడు శరత్‌బాబు, రెడ్‌క్రాస్ చైర్మన్ ప్రకాష్ బాబు, ఉపాధ్యక్షుడు డాక్టర్ చిట్యాల వెంకటేశ్వర రెడ్డి, రచయిత్రి సింహాద్రి జ్యోతిర్మయి, సాహితీవేత్తలు, కళాకారులు పాల్గొన్నారు.

మార్కాపురంలో సీఎంఆర్ షాపింగ్ మాల్



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



చీరలు చూస్తున్న సినీనటి అనసూయ

● ప్రారంభించిన మంత్రి సురేష్, సినీనటి అనసూయ

మార్కాపురం: తెలుగు రాష్ట్రాల్లోని అతి పెద్ద వస్త్రవ్యాపార సంస్థ అయిన సీఎంఆర్.. మార్కాపురం పట్టణంలోని కాలేజీ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన షాపింగ్ మాల్‌ను బుధవారం ఉదయం రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖామంత్రి ఆదిమూలపు సురేష్, యాంకర్, సినీనటి అనసూయ ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సబ్ కలెక్టర్ సేతుమాధవన్, డీఎస్పీ వీరరాఘవరెడ్డి, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణ, 35వ వార్డు కౌన్సిలర్ వై.వెంకటనారాయణరెడ్డి, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ వక్కలగడ్డ మల్లికార్జున్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎంఆర్ ఫౌండర్ చైర్మన్ మావూరి వెంకటరమణ మాట్లాడుతూ తమ షాపింగ్ మాల్ ద్వారా మార్కాపురంలో ప్రపంచ స్థాయి వస్త్రాలు లభిస్తాయని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఎండీ మావూరి మోహన్ బాలాజీ మాట్లాడుతూ తమ 28వ షోరూంను మార్కాపురంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. సినీనటి, యాంకర్ అనసూయ భరద్వాజ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఈ కార్యక్రమంలో మార్కాపురం, యర్రగొండపాలెం ఏఎంసీ చైర్మన్లు జి.శ్రీనివాసరెడ్డి, ఉడుముల శ్రీనివాసరెడ్డి, సీవ భీమానాయక్, ఎస్సైలు కోటేశ్వరరావు, సువర్ణ, వెంకటేశ్వరనాయక్, బిల్డింగ్ యజమాని ఉడుముల శ్రీనివాసరెడ్డి, సీఎంఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా పూర్తిస్థాయిలో పునరుద్ధరించాం

● ఏపీసీపీడీసీఎల్ ఎస్ఈ కేవీజీ సత్యనారాయణ



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ ఎస్ఈ సత్యనారాయణ

ఒంగోలు సబర్బన్: తుఫాన్ ప్రభావంతో విద్యుత్ సరఫరాలో నెలకొన్న అవాంతరాలను పూర్తిస్థాయిలో పునరుద్ధరించి వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేశామని ఏపీసీపీడీసీఎల్ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఎస్ఈ కేవీజీ.సత్యనారాయణ తెలిపారు. స్థానిక విద్యుత్ భవన్‌లో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తుఫాన్ వల్ల జరిగిన నష్టాన్ని, దెబ్బతిన్న విద్యుత్ వ్యవస్థ, పునరుద్ధరించిన తీరును విద్యుత్ శాఖ ఉమ్మడి ప్రకాశం జిల్లా ఈఈ(టెక్నికల్) టి.హైమావతితో కలిసి వివరాలు వెల్లడించారు. తుఫాన్ ప్రభావంతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 135 విద్యుత్ సబ్‌స్టేషన్లలో పరిధిలో విద్యుత్ లైన్లు అస్తవ్యస్తంగా మారాయన్నారు. 33 కేవీ విద్యుత్‌లైన్లలో 53 సబ్‌స్టేషన్ల పరిధిలో నష్టం వాటిల్లిందని, 33 కేవీ లైన్లలో ఒకే ప్రాంతంలో 4కిలో మీటర్ల మేర లైన్లు దెబ్బతిన్నట్లు తెలిపారు. ఇందులో మొత్తం 29 విద్యుత్ పోల్స్ పడిపోయాయని చెప్పారు. 11 కేవీ విద్యుత్ లైన్లలో 345 పోల్స్ దెబ్బతిన్నాయని, 11 కేవీలోని 304 ఫీడర్లలో కూడా పూర్తిస్థాయిలో పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. వ్యవసాయ, ఆక్వా రైతులకు సంబంధించి 65 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయన్నారు. ఒంగోలు పట్టణంలో 23 కిలోమీటర్ల మేర లైన్లు, 384 ఎల్‌టీ విద్యుత్ స్తంభాలు దెబ్బతినట్లు వివరించారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని 37 మండలాల పరిధిలోని మొత్తం 685 గ్రామాల్లో తుఫాను ప్రభావం చూపించిందని తెలిపారు. 6637 వ్యవసాయ విద్యుత్ సర్వీసులను, 1.17 లక్షల వ్యవసాయేతర విద్యుత్ సర్వీసులు పునరుద్ధరించినట్లు పేర్కొన్నారు. నెల్లూరు జిల్లా కందుకూరు, ప్రకాశం జిల్లా ఒంగోలు, కనిగిరి, బాపట్ల జిల్లా అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల పరిధిలో ఎక్కువగా నష్టం వాటిల్లిందని తెలిపారు.

తుఫాన్ ముందస్తు చర్యల్లో భాగంగా మంచి నీటి పథకాలకు సంబంధించిన అధికారులను అప్రమత్తం చేశామన్నారు. జిల్లా వ్యాప్తంగా వైద్యశాలల నిర్వాహకులను కూడా అప్రమత్తం చేసి జనరేటర్లను సిద్ధం చేసుకోవాలని ముందుగానే సూచించినట్లు చెప్పారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రాణ, ఆస్తి నష్టాలు, పశువుల మరణాలు లేకుండా చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఈఈ టెక్నికల్‌తో పాటు ఏఈ టెక్నికల్ ఆర్.బాలమురళి కూడా ఉన్నారు.

పోలీస్ విధుల్లో హోంగార్డుల పాత్ర కీలకం

● హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవంలో ఎస్పీ మలికాగర్గ్



హోంగార్డుల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ మలికాగర్గ్

ఒంగోలు సబర్బన్: పోలీస్ విధుల్లో హోంగార్డుల పాత్ర కీలకమని ఎస్పీ మలికాగర్గ్ అన్నారు. 61వ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పోలీస్ కళ్యాణ మండపంలో బుధవారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. తొలుత హోంగార్డుల గౌరవ వందనాన్ని ఎస్పీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డుల వ్యవస్థాపక దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. పోలీసులతో సమానంగా హోంగార్డులు శాంతి భద్రతల పరిరక్షణ, నేర నియంత్రణ, విపత్తుల నిర్వహణలో సేవలు అందిస్తున్నారన్నారు. హోంగార్డుల సంక్షేమం కోసం పలు పథకాలను ప్రవేశపెట్టామన్నారు. ప్రతి సంవత్సరం డిసెంబర్ 6న హోంగార్డుల రైజింగ్ డే నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా వ్యాప్తంగా 694 మంది హోంగార్డులు ఉంటే వారిలో 82 మంది మహిళలు ఉండటం విశేషమని వివరించారు. హోంగార్డులు పోలీస్ శాఖలో అంతర్భాగమని, బందోబస్తుతో పాటు టెక్నికల్ విభాగం, ట్రాఫిక్ విభాగాల్లో కూడా వీరి సేవలు మరువలేనివని వెల్లడించారు. హోంగార్డులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఏఎస్పీ(అడ్మిన్)కే నాగేశ్వరరావు, ఏఎస్పీ (క్రైమ్స్) ఎస్వీ శ్రీధర్‌బాబు, ఏఆర్ ఏఎస్పీ అశోక్‌బాబు, ఎస్బీ డీఎస్పీ బి.మరియదాసు, ఒంగోలు డీఎస్పీ వి.నారాయణస్వామిరెడ్డి, ట్రాఫిక్ డీఎస్పీ శ్రీనివాసరావు, ఏఆర్ డీఎస్పీ వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో మాట్లాడుతున్న జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ కలిశారు. విజయవాడ ఏ1 కన్వెన్షన్‌లో ఎమ్మెల్సీ, సీఎం ప్రోగ్రాం కో ఆర్డినేటర్ తలశిల రఘురాం కుమార్తె వివాహం జరిగింది. ఈ వివాహానికి హాజరైన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని బూచేపల్లి వెంకాయమ్మ కలిసి మాట్లాడారు. – దర్శి

పోలీస్‌స్టేషన్‌లో యువకుడి ఆత్మహత్యాయత్నం



కాలిన గాయాలతో మార్కాపురం ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధితుడు



పోలీస్ స్టేషన్ ఎదుట రాస్తారోకో చేస్తున్న బాధితుడి బంధువులు

● రాస్తారోకో చేసిన మోజెస్ బంధువులు

యర్రగొండపాలెం: పోలీసులు వేధింపులకు గురిచేశారని ఒక యువకుడు పెట్రోలు పోసుకొని పోలీస్ స్టేషన్‌లో ఆత్మహత్యకు యత్నించిన సంఘటన బుధవారం రాత్రి యర్రగొండపాలెం పోలీస్ స్టేషన్‌లో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. వీధుల్లో అల్లరిగా తిరుగుతున్నారన్న ఆరోపణపై పోలీసులు మోజెస్, సుభాని అనే యువకులను పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. మోజెస్ చదువుకున్నాడని తెలిసిన సీఐ కె.మారుతీకృష్ణ అతని తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. కౌన్సెలింగ్ సమయంలో పోలీసులు ఆ యువకుడి తల్లిదండ్రుల పట్ల దురుసుగా ప్రవర్తించారని దీంతో మోజెస్ ఆత్మహత్యాయత్నం చేసి ఉంటాడని అతని బంధువులు ఆరోపిస్తున్నారు. కౌన్సెలింగ్ అనంతరం ఇంటికి వెళ్లిన మోజెస్ బాటిల్లో పెట్రోలు పోసుకుని పోలీస్ స్టేషన్‌కు వచ్చాడని, అక్కడ పెట్రోల్‌ను తన వంటిపై పోసుకొని నిప్పు అంటించుకున్నాడని స్థానికులు చెబుతున్నారు. మోజెస్ మంటలను తాళలేక బయటికి పరుగెత్తుకుంటూ వచ్చి నీళ్ల నిలువ ఉంచిన డ్రమ్ములో మునిగినట్లు వారు తెలిపారు. వెంటనే పోలీసులు బాధితుడ్ని మార్కాపురంలోని ఓ ప్రైవేట్ వైద్యశాలకు తరలించారు. కాలిన గాయాలతో ఉన్న యువకుడిని పోలీసులు స్థానిక వైద్యశాలలో చేర్పించి ప్రాథమిక చికిత్స చేయించకుండా 40 కిలో మీటర్ల దూరంలో ఉన్న మార్కాపురం వైద్యశాలకు తరలించడంపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. సంఘటన తెలిసిన మోజెస్ తల్లిదండ్రులు, బంధువులు స్థానిక వైద్యశాల వద్దకు చేరారు. అక్కడ బాధితుడు లేకపోవడంతో పోలీస్ స్టేషన్ వద్దకు వెళ్లి రాస్తారోకో చేశారు. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. మార్కాపురం ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న మోజెస్ పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు.

ఆర్టీసీ బస్సు-బైకు ఢీ





గాయాలపాలైన షేక్ గఫూర్, పశుమర్తి గంగయ్య

చీమకుర్తి: ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, బైకు ఢీకొనడంతో బైకుపై ఉన్న ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఒంగోలు-కర్నూలు రోడ్డుపై బుధవారం రాత్రి 7 గంటల సమయంలో చీమకుర్తి మండలంలోని రామతీర్థం సమీపంలో ఈ ప్రమాదం జరిగింది. చీమకుర్తి క్రిస్టియన్‌పాలేనికి చెందిన పశుమర్తి గంగయ్య రామతీర్థంలోని గ్రానైట్ ఫ్యాక్టరీలలో గ్రానైట్ రాళ్ల లోడింగ్‌కు బైకుపై చీమకుర్తి నుంచి రామతీర్థం వైపు వెళ్తున్నాడు. ఇంతలో చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూలు వద్ద యల్లయ్యనగర్‌కు చెందిన విద్యార్థి గఫూర్ రామతీర్థం వైపు వెళ్లేందుకు లిఫ్ట్ అడిగాడు. గంగయ్య ఆ విద్యార్థిని బైకుపై ఎక్కించుకుని రామతీర్థం సమీపంలోకి రాగానే ఎదురుగా వచ్చిన గిద్దలూరు ఆర్టీసీ బస్సు ఢీకొట్టింది. దీంతో బైకుపై ఉన్న ఇద్దరూ ఒక్కసారిగా రోడ్డు మీద పడిపోయారు. ఈ ప్రమాదంలో బైకు నడుపుతున్న గంగయ్య తలకు బలమైన గాయాలవడంతో ప్రాణాపాయ స్థితిలో ఉన్నారు. విద్యార్థి గఫూర్‌కు కూడా తీవ్ర గాయాలై పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఇద్దరినీ అదే రూట్‌లో వస్తున్న 108 వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. చీమకుర్తి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.

అదుపుతప్పి టిప్పర్ బోల్తా

పొదిలిరూరల్: మండలంలోని కంభాలపాడులో ఒంగోలో-కర్నూలు రహదారిపై బుధవారం అదుపు తప్పి టిప్పర్ బోల్తా పడింది. ఈసంఘటనలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే..మర్రిచెట్లపాలెం నుంచి బేస్తవారిపేట వైపు టిప్పర్ కంకర లోడుతో వెళుతోంది. కానీ ఒక్కసారిగా అదుపు తప్పి బ్రిడ్జిని ఢీకొట్టడంతో టిప్పర్ బోల్తా పడింది. ప్రమాదంలో బ్రిడ్జి ప్రహరీతో పాటు ఎన్ఏపీ పైపులైన్, కేబుల్ వైరు ధ్వంసమయ్యాయి. డ్రైవర్‌కి స్వల్ప గాయాలు మినహా ఎవరికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సువర్ణ

మార్కాపురం: పట్టణ పరిధిలోని కంభం రోడ్డులోని వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయ సమీపంలోని డ్రైనేజీ పక్కన సుమారు 45 ఏళ్ల వ్యక్తి మృతదేహాన్ని కనుగొన్నట్లు టూటౌన్ ఎస్సై సువర్ణ తెలిపారు. మృతుని వయసు 45 ఏళ్లు ఉంటాయని, హిందీ మాట్లాడుతాడని స్థానికులు చెప్పినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా వైద్యశాలకు తరలించినట్లు పేర్కొన్నారు. మృతుడు నాలుగు రోజులుగా ఇక్కడే సంచరిస్తున్నట్లు చెప్పారు.